www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 25 మార్చి 2024

5

పశ్చిమ గోదావరి



అమలు కాని ఎన్నికల కోడ్

ప్రజాశక్తి - కాళ్ల

ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించడంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని ఏలూరుపాడులో గ్రామ సచివాలయం భవనంపైన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కనిపించకుండా క్లాత్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఏలూరుపాడు గ్రామం సుస్వాగతం బోర్డుపై అధికారులు, రాజకీయ నాయకుల ఫొటోలు కనిపించకుండా చర్యలు తీసుకోలేదు. రహదారి పక్కన టిడిపి జెండా కనిపిస్తున్నా వాటిని తొలగించేందుకు అధికారులు సాహసించడం లేదు.



సుస్వాగతం బోర్డుపై రాజకీయనాయకుల ఫొటోలు

తాగునీటిపై.. ఏం చెబుతారో..!

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా ప్రజలను వేధిస్తున్న ప్రధాన సమస్యల్లో తాగునీరు ప్రధానమైంది. తాము అధికారంలోకి వస్తే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆశ చూపడం, గెలిచిన తర్వాత జిల్లా ప్రజలను మోసం చేయడంలో వైసిపి, టిడిపి రెండు పార్టీలు ఒకే బాటలో నడిచాయి. ముచ్చటగా మూడోసారి ఎన్నికల్లో తాగునీటి సమస్యపై ఇరు పార్టీలు ఎటువంటి అబద్ధాలు చెబుతాయో అంటూ జిల్లా ప్రజానీకంలో చర్చ కొనసాగుతోంది.



జిల్లా ప్రజలను మోసగించిన వైసిపి, టిడిపి

2014 నుంచి తాగునీటి సమస్యకు పరిష్కారం నిల్

వాటర్‌గ్రిడ్ పేరుతో ఆశలు.. ఒక్క రూపాయి ఖర్చుచేయని పరిస్థితి

ఆక్వా కాలుష్యంతో తాగునీటికి డెల్టా ప్రజలు విలవిల

ఈ సారి ఎన్నికల్లో ఏం మాయమాటలు చెబుతారోనన్న చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిబంధలనకు విరుద్ధంగా సాగిన చేపల చెరువుల తవ్వకాలతో తాగునీటి వనరులన్నీ కలుషితమై ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని దాదాపు 25 మండలాల ప్రజలు తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరని దుస్థితి ప్రజలకు నెలకొంది. ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించడంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు రెండూ విఫలమయ్యాయి. ఎన్నికల్లో ఓట్ల కోసం జనాలకు మాయమాటలు చెప్పడం, గెలిచిన తర్వాత జిల్లా ప్రజల గోడు పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిపోయింది. దాదాపు 30 లక్షల జనాభా ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించకుండా పదేళ్లుగా టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఆడిన డ్రామా గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతోంది. వ్యర్థాలు, పురుగుమందులు కలిపిన ఆక్వా చెరువుల్లోని నీటిని పంట కాలువల్లోకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. ఆ పంటకాలువల ద్వారా వచ్చే నీటితోనే తాగునీటి చెరువులను నింపుతున్నారు. దీంతో పసర్లు కమ్మి కలుషితంగా మారిన నీటిని జనం తాగలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రతిరోజునూ రూ.20 వెచ్చించి తాగునీరు కొనుగోలు చేస్తే తప్ప ఏ కుటుంబానికీ రోజు గడవని పరిస్థితిని తీసుకొచ్చారు. కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. 2014 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని టిడిపి హామీలు గుప్పించింది. ప్రతి కుటుంబానికీ 20 లీటర్ల నీరు ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. ఐదేళ్ల పాలనలో ఏ ఒక్కటీ టిడిపి ప్రభుత్వం నెరవేర్చకపోగా, విచ్చలవిడిగా చేపల చెరువుల తవ్వకాలకు అనుమతివ్వడంతో తాగునీరు మరింత అధ్వానంగా మారింది. 2019 ఎన్నికలకు ముందు వైసిపి అధ్యక్షుడు జగన్ తాగునీటి సమస్యను ప్రధాన ఆయుధంగా చేసుకుని అప్పటి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వాటర్ బాటిల్‌లో తాగునీరు నింపి ఆ నీటిని మనుషులు తాగుతారా అంటూ విమర్శలు సంధించేవారు. తాము అధికారంలోకి వస్తే వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి గోదావరి నుంచి పైప్‌లైన్ల ద్వారా తాగునీటిని ప్రజలకు అందిస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక వాటర్ గ్రిడ్ కోసం రూ.3,200 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఇంకేముంది రెండు, మూడేళ్లలో అందరికీ గోదావరి నుంచి నేరుగా తాగునీరు ఇంటికి చేరుతుందని ఊదరగొట్టారు. ఇప్పటి వరకూ ఒక్క అడుగు పడలేదు.. ఒకపైసా ఖర్చు పెట్టిన పాపన పోలేదు. గడిచిన ఐదేళ్లలో తాగునీటి వనరులను మరింత అధ్వానంగా తయారు చేశారు.

మోసపూరిత మాటలతో అత్యధిక స్థానాలు కైవసం..

2014లో ఎన్నికల్లో టిడిపి తాగునీటిపై చెప్పిన మోసపూరిత మాటలను జిల్లా ప్రజలు నమ్మారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని నమ్మి ఉమ్మడి జిల్లాలో ఉన్న 15 అసెంబ్లీ స్థానాల్లోనూ టిడిపి అభ్యర్థులను ప్రజలు గెలిపించారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడంలో జిల్లాలో గెలిచిన స్థానాలు ప్రధాన పాత్ర పోషించాయి. ఇదే విషయం అనేకసార్లు టిడిపి అధినాయకుడు చంద్రబాబు సైతం అనేక బహిరంగ సభల్లో ప్రస్తావించారు. ఆయన తాగునీటి సమస్యను పరిష్కరించకపోవడంతో ఆగ్రహించిన ప్రజలు 2019లో తాగునీటిపై వైసిపి అధ్యక్షుడు జగన్ చెప్పిన మాటలను నమ్మారు. 'మాట తప్పను.. మడమ తిప్పను' అంటూ ఆయన చెప్పిన మాటలను జనం విశ్వసించారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 15 అసెంబ్లీ స్థానాలకు గాను 13 చోట్ల వైసిపి గెలిపించారు. ఐదేళ్ల పాలనలో జిల్లా ప్రజలకు తాగునీటి వాగ్దానాన్ని జగన్ పరిష్కరించలేకపోయారు. వైసిపి, టిడిపి సైతం తాగునీటి విషయంలో జిల్లా ప్రజలను మోసం చేయడంతో జనానికి ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. మరోసారి ఇరు పార్టీలు తమకు ఓటువేయాలని ప్రజల ముందుకొస్తున్నాయి. పరిష్కారం కాకుండా ఉన్న తాగునీటిపై ఏం మాయమాటలు చెబుతాయో అన్న చర్చ జనాల్లో నడుస్తోంది. ఇరు పార్టీలకు జనం బుద్ధిచెబితే తప్ప జిల్లా ప్రజలకు న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

రఘు రామకృష్ణంరాజుకు ఝలక్..!

నరసాపురం బిజెపి ఎంపీ అభ్యర్థిగా శ్రీనివాస వర్మకు టిక్కెట్

తానే పోటీ చేస్తానంటూ గతంలో ప్రకటించిన రఘు రామకృష్ణంరాజు టిక్కెట్ ఇచ్చేందుకు బిజెపి నిరాకరణ

చర్చనీయాంశంగా రఘు రామకృష్ణంరాజు రాజకీయ భవితవ్యం

విజయనగరం ఎంపీ అభ్యర్థిగా టిడిపి నుంచి పోటీ చేయనున్నారా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నరసాపురం పార్లమెంట్ బిజెపి అభ్యర్థిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన భూపతిరాజు శ్రీనివాస వర్మకు టిక్కెట్ ఖరారైంది. మాజీ ఎంపీ కనుమూరి రఘు రామకృష్ణంరాజుకు బిజెపి అధిష్టానం ఝలక్ ఇచ్చింది. నరసాపురం పార్లమెంట్ స్థానం నుంచి తానే పోటీచేస్తానంటూ ప్రకటించుకున్న రఘు రామకృష్ణంరాజు పరిస్థితి ఏంటన్న చర్చ రాజకీయాల్లో జోరుగా కొనసాగుతోంది. 2014లో బిజెపి నుంచి నరసాపురం పార్లమెంట్ టిక్కెట్‌ను రఘు రామకృష్ణంరాజు ఆశించారు. పొత్తుల్లో భాగంగా నరసాపురం ఎంపీగా బిజెపి గోకరాజు గంగరాజును బరిలోకి దింపి రఘు రామకృష్ణంరాజును పక్కకు పెట్టింది. తాను టిడిపి నుంచి పోటీలో ఉంటానంటూ నామినేషన్ సైతం వేశారు. ఏ పార్టీ నుంచి బిఫాం రాకపోవడంతో నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు. 2019లో టిడిపి నుంచి నరసాపురం ఎంపీగా పోటీలోకి దిగుతారని అంతా భావించారు. టిడిపి సైతం రఘు రామకృష్ణంరాజుకే టిక్కెట్ ఇచ్చేందుకు సిద్ధపడింది. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఆయన వైసిపిలో చేరి ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీచేసి గెలిచారు. గెలిచిన కొద్దిరోజుల తర్వాత వైసిపి రెబల్‌గా మారారు. వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసేవారు. దీంతో ఆయనను అరెస్టు చేయడం వంటి చర్యలు సైతం సాగాయి. అరెస్టు ఘటన తర్వాత రఘు రామకృష్ణంరాజు పూర్తిగా టిడిపి తరపున మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వాన్ని ఎండగట్టేవారు. దీంతో ఈ సారి టిడిపి నుంచి రఘు రామకృష్ణంరాజు పోటీచేస్తారని అంతా భావించారు. కొద్దిరోజుల క్రితం తాడేపల్లిగూడెంలో జరిగిన టిడిపి, జనసేన ఉమ్మడి బహిరంగ సభకు హాజరైన రఘు రామకృష్ణంరాజు నరసాపురం ఎంపీగా తానే పోటీచేస్తానంటూ చంద్రబాబు, పవన్ ముందే ప్రకటించుకున్నారు. పొత్తులో భాగంగా నరసాపురం ఎంపీ స్థానం బిజెపికి వెళ్లింది. దీంతో రఘు రామకృష్ణంరాజుకు టిక్కెట్ వస్తుందా రాదా అన్న చర్చ గత కొద్దిరోజులుగా కొనసాగుతోంది.. గతంలో బిజెపి జిల్లా అధ్యక్షుడుగా పనిచేసిన భూపతిరాజు శ్రీనివాస వర్మకు టిక్కెట్ ఇవ్వడంతో రఘురామకృష్ణంరాజుకు పూర్తిగా తలుపులు మూసుకుపోయాయి. బిజెపి రఘు రామకృష్ణంరాజుకు ఝలక్ ఇవ్వడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సోమూ వీర్రాజు ద్వారా రాయబారం నడిపి తనకు వైసిపి టిక్కెట్ రాకుండా చేసిదంటూ రఘు రామకృష్ణంరాజు చెబుతున్న పరిస్థితి నెలకొంది. రఘు రామకృష్ణంరాజు రాజకీయ భవిష్యత్తు ఏంటన్న చర్చ సర్వత్రా నెలకొంది. విజయనగరం ఎంపీగా టిడిపి నుంచి రఘు రామకృష్ణంరాజు పోటీచేసే అవకాశం ఉందన్న ప్రచారం సైతం కొనసాగుతోంది.



భూపతిరాజు శ్రీనివాస వర్మ

అక్రమ వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించం

డిఇఒ వెంకటరమణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - భీమవరం

పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ పేరుతో అక్రమ వసుళ్లకు పాల్పడుతున్నారంటూ పదో తరగతి పబ్లిక్ దందా అనే శీర్షికతో ప్రజాశక్తి పత్రికలో శనివారం ప్రచురించిన కథనానికి జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించారు. పరీక్షల నిర్వహణ పేరుతో ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల నుంచి రూ.200 నుంచి రూ.500 వరకు అక్రమ వసూళ్లు చేసిన సొమ్ము అంతా ప్రభుత్వ పాఠశాలలకు అందిస్తున్నట్లు, పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా సొంత డబ్బులను వెచ్చిస్తున్నట్లు, ఇదంతా జిల్లా విద్యాశాఖ కనుసన్నలోనే జరుగుతున్నట్లు ప్రజాశక్తి దృష్టికి వచ్చింది. ఇదే విషయాన్ని ప్రభుత్వ, ప్రయివేట్ ఉపాధ్యాయులు ప్రజాశక్తి దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఈ అంశాలన్నిటిని జోడించి పదో తరగతి పరీక్షల దందా అనే శీర్షికతో సమగ్ర కథనం ప్రజాశక్తి పత్రికలో ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ స్పందించారు. పరీక్షల నిర్వహణ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. యాజమాన్యాలు, వ్యక్తులపై శాఖపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు కఠిన చర్యలకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాస్తున్నారని తెలిపారు.

మహిళలకు ప్రాధాన్యతేదీ..!

రాజకీయాల్లో గుర్తింపునివ్వరా!

జిల్లాలో ఒకే మహిళకు అవకాశం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రపంచంలోనే మహిళలు పురుషులకు తామేమి తీసిపోమని అన్ని రంగాల్లోనూ రాకెట్ మాదిరిగా దూసుకుపోతున్నారు. అలాంటి మహిళలకు రాజకీయ పార్టీల విషయానికొస్తే ఓట్ల కోసం మహిళల జపం చేస్తున్నారే తప్ప వారికి రాజ్యాధికారంలో అవకాశాలు కల్పించడం లేదు. రాష్ట్రంలో ఎన్నికలు రానున్న తరుణంలో అధికార పార్టీతో పాటు టిడిపి కూటమిలో టిక్కెట్లు కేటాయింపుల విషయంలో కులగణాలు, సామాజిక తరగతి, ఆర్థికంగా బలవంతులపైనే కసరత్తు చేసి వారికి టిక్కెట్లు కేటాయించి మహిళల ఊసే మర్చిపోయారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఒక పార్లమెంటు స్థానానికి మాత్రమే మహిళకు అవకాశం కల్పించారు.

టిడిపి కూటమిలో ఏడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను పరిశీలిస్తే జనసేన భీమవరం పులపర్తి రామాంజనేయులు, టిడిపి ఉండి అభ్యర్థి మంతెన రామరాజు, జనసేన నరసాపురం అభ్యర్థి బొమ్మిడి నాయకర్, టిడిపి పాలకొల్లు అభ్యర్థి నిమ్మల రామానాయుడు, టిడిపి ఆచంట అభ్యర్థి పితాని సత్యనారాయణ, టిడిపి తణుకు అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ, జనసేన తాడేపల్లిగూడెం అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పురుషులకే కేటాయించాయి. బిజెపి నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిగా భూపతి రాజు శ్రీనివాస్ వర్మకు అవకాశం కల్పించారు. అధికార పార్టీ వైసిపి పరిశీలిస్తే భీమవరం అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్, తణుకు అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు, నరసాపురం అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు, ఆచంట అభ్యర్థి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు, ఉండి అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు, పాలకొల్లు అభ్యర్థి గుడాల గోపాలకృష్ణ (గోపీ), తాడేపల్లిగూడెం అభ్యర్థి కొట్టు సత్యనారాయణలకు అవకాశం కల్పించారు. నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిగా బిసి మహిళ శెట్టిబలిజ సామాజిక తరగతికి చెందిన గూడూరి ఉమాబాలను అభ్యర్థిగా ప్రకటించారు. ఓట్లు అడిగేటప్పుడు రాజకీయ నాయకులు మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామని చెప్పి ఎన్నికలు అయిపోగానే మహిళలను విస్మరిస్తున్నారని మహిళా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఎప్పటికప్పుడు సంక్షేమ పథకాల్లో రాజకీయ పార్టీలు మహిళలకు పెద్ద పేట వేస్తున్నామని చెప్పి అధికారంలోకొచ్చిన తర్వాత మహిళలకు సముచిత స్థానం కల్పించడంలేదని విమర్శలు లేకపోలేదు. ఒకపక్క మహిళలపై నిత్యం లైంగిక వేధింపులు, అత్యాచారాలు వంటి సంఘటనలు పెరిగిపోతున్న సమయంలో మహిళలకు రాజ్యాధికారం అప్పగిస్తే వారి రక్షణ చట్టాలపై చట్టసభల్లో గొంతు వినిపించేందుకు, చట్టాలు కఠినంగా అమలు చేసేందుకు మహిళలు ఉంటేనే న్యాయం జరుగుతుందని, రాజకీయ పార్టీలు మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని బలమైన వాదనలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల ప్రచారంలో ఉద్యోగుల ప్రమేయం ఉండకూడదు

కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయం ఉండకూడదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంసిసి అమలుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఏ రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల్లోనైనా ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నట్లు ఫిర్యాదులు వస్తే తక్షణమే వారిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఇవిఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ పూర్తి చేసి సిద్ధంగా పెట్టుకున్నట్లు చెప్పారు. సి-విజిల్ యాప్ నుంచి వచ్చిన ఫిర్యాదులు వంద నిమిషాల్లోపు పరిష్కరించనున్నట్లు చెప్పారు. 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫిర్యాదు ఇచ్చిన 24 గంటల్లోపు విచారణ చేసి పరిష్కరించనున్నట్లు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే ఎఫ్ఎస్‌టిలు, ఎంసిసి, విఎస్‌టి టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో చాలా పకడ్బందీగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆ ముగ్గురు ఎవరు..!

కలవరపడుతున్న జిల్లా అధికార యంత్రాంగం

సి విజిల్ యాప్ ఫిర్యాదుదారుల వివరాలు బహిర్గతం చేశారని ఆరోపణలు

రెండు, మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఇటీవల ఏలూరు జిల్లాలో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

పశ్చిమగోదావరి జిల్లాలో కూడా సస్పెన్షన్ తప్పదా ?

ప్రజాశక్తి - భీమవరం

అటు రాజకీయ నాయకులు.. ఇటు ఎన్నికల అధికారుల్లో భయం పుట్టిస్తున్న ఏకైక యాప్ సి విజిల్ యాప్.. రాజకీయ నాయకుల అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేసేందుకు ఈ సి విజిల్ యాప్ ఎంతో ఉపకరిస్తుంది. ఈ యాప్‌ను మోనిటరింగ్ చేస్తున్న అధికారులు ఫిర్యాదు చేసిన వారి వివరాలు బహిర్గతం చేస్తే కఠిన చర్యలకు అధికారులు వారంతటికి వారే కొని తెచ్చుకున్నట్లే. పక్కా నిఘాలో పర్యవేక్షిస్తున్న ఈ సి విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదు దారుడి వివరాలు బహిర్గతం చేశారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మరో రెండు, మూడు రోజుల్లో ఇద్దరూ లేక ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోబోతున్నట్లు, వారు ఎవరో చెబుతామంటూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేసిన వ్యాఖ్యలు అధికారుల్లో కలకలం రేపుతున్నాయి.

సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా సాఫీగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ట చర్యలు చేపట్టింది. అక్రమాలకు అడ్డుకట్ట వేసే అన్ని రకాల వనరులను ఉపయోగిస్తుంది. దీనిలో భాగంగానే తీసుకొచ్చిన సి విజిల్ యాప్ ఒకటి. ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘించిన రాజకీయ నాయకుల పని పట్టేందుకు సామాన్య ప్రజలు దీన్ని పాశుపతాస్త్రంగా ఉపయోగించేందుకు అధికారులు ప్రజల్లోకి తీసుకొచ్చారు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతులు అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం, ఎక్కడైనా ఎన్నికల వల్ల కనిపిస్తే ఎవరైనా యాప్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ సి విజిల్ యాప్‌ను జిల్లాలో అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడే ఈ యాప్‌ను నిరంతరం పర్యవేక్షించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి సి విజిల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, అధికారులు సైతం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వాటిని సాక్ష్యాలతో సహా ఇందులో పొందుపర్చవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్ లో అప్లోడ్ చేయాల్సి ఉంది. ఈ యాప్ లో ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులకు రంగంలోకి దిగి 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుని విచారించిన 30 నిమిషాల్లో వివరాలు సేకరించిన అనంతరం ఎన్నికల అధికారికి నివేదిక పంపిస్తారు. అయినా వచ్చిన ఫిర్యాదుపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా వంద నిమిషాల్లో సి విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదులపై పకడ్బందీగా చర్యలు చేపట్టారు. అయితే ఈ సి విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన ఫిర్యాదుదారుడి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే కొంత మంది అధికారులు నిబంధనలు తుంగలోతొక్కి నియమావళిని ఉల్లంఘించే విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదుదారుల వివరాలను ఫిర్యాదు చేసిన సంబంధిత రాజకీయ పార్టీలు అభ్యర్థులకు అందిస్తున్నారని ఆరోపణలు జిల్లాలో బలంగా వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి దాసోహంగా కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా అధికంగానే వినిపిస్తున్నాయి.

జిల్లాలో సి విజిల్ యాప్ పర్యవేక్షణతో పాటు ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. అలాగే ఫిర్యాదుదారుని వివరాలు బహిర్గతం కాకుండా చర్యలు తీసుకున్నారు. బహిర్గతం చేస్తే సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన దగ్గర్నుంచి ఇప్పటివరకు 41 ఫిర్యాదులు సి విజిల్ యాప్ ద్వారా అందాయి. దీనిలో 29 ఫిర్యాదులు పరిష్కరించడం జరిగింది. మరో 19 ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించారు. ఈ వివరాలను జిల్లా కలెక్టరేట్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్లతో కలిసి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంలో సి విజిల్ యాప్ ఫిర్యాదులపై ఏ విధంగా వ్యవహరిస్తున్నారు, ఫిర్యాదుదారుని వివరాలు బహిర్గతం చేస్తే ఎటువంటి చర్యలు తీసుకుంటారని ప్రజాశక్తి ప్రశ్నించింది. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఫిర్యాదుదారుని వివరాలు బహిర్గతం చేస్తే ఉపేక్షించేది లేదని చెప్పారు. జిల్లాలో ఈ అంశంపై సమగ్ర విచారణ జరుగుతుందని, ఇద్దరు లేదా ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోబోతున్నట్లు చెప్పారు. ఇది మున్సిపాల్టీ అయినా కావచ్చు మరో ఏదో ప్రాంతమైన కావచ్చు అంటూ చేసిన వ్యాఖ్యలు అధికారుల్లో కలకలం సృష్టించాయి. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురు అధికారులు ఎవరనేది సార్వత్రా చర్చ సాగుతుంది. ముఖ్యంగా అధికారుల్లో సస్పెన్షన్ టెన్షన్ నెలకొంది. ఇప్పటికే పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఒక అధికారిని వేరే ప్రాంతానికి బదిలీ చేస్తున్నట్లు సమాచారం.

ఏలూరు జిల్లాలో ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

సి విజిల్ ఫిర్యాదు బహిర్గతమైన ఘటనలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన చేబ్రోలు గ్రామ సచివాలయం-1 పంచాయతీ కార్యదర్శి బివి.రవిచంద్రకుమార్, ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కం టైపిస్ట్ బి.అమృతను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఎంపిడిఒ శర్మకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. నల్లమాడు గ్రామ శివారు రామచంద్రపురంలో గ్రంథాలయం, వాటర్ ప్లాంట్‌కు వైసిపి రంగులు ఉండడంతో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఈ నెల 19న సి విజిల్ యాప్‌లో ఫిర్యాదుచేశాడు. స్పందించిన అధికారులు గంటలోపే దానికి తెల్లసున్నం వేయించారు. ఫిర్యాదుదారుల విషయాన్ని గోప్యంగా ఉంచాల్సిన సిబ్బంది అతని వివరాలు తెలిపేలా ల్యాబ్‌టాప్‌లో స్క్రీన్ షాట్ తీసి అధికార పార్టీ నాయకులకు సమాచారం అందించారు. దీంతో ఫిర్యాదుదారుడి స్నేహితుడిని వైసిపి నాయకుడు నిలదీశాడు. ప్రభుత్వ సిబ్బంది తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. గోప్యంగా ఉంచాల్సిన ఫిర్యాదుదారుడి సమాచారాన్ని బహిర్గతం చేసిన బాధ్యులపై కలెక్టర్ చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇటువంటి చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తున్న నేపథ్యంలో ఉద్యోగుల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది.

జనసేన అభ్యర్థులు ఖరారు

ఏలూరు ప్రతినిధి : ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఐదు స్థానాలకు జనసేన పార్టీ అభ్యర్థులను ఖరారు చేసింది. గతంలోనే వీరిని ప్రకటించినప్పటికీ ఆదివారం సాయంత్రం అధికారిక జాబితా కింద విడుదల చేసింది. తాడేపల్లిగూడెం నుంచి బొలిశెట్టి శ్రీనివాస్, భీమవరం నుంచి పులపర్తి ఆంజనేయులు, నరసాపురం నుంచి బొమ్మిడి నాయకర్, ఉంగుటూరు నుంచి పత్సమట్ల ధర్మరాజు, పోలవరం నుంచి చిర్రి బాలరాజుకు టిక్కెట్లు దక్కాయి. కొన్నిరోజుల క్రితం వీరికి పార్టీ తరపున అభ్యర్థులను ఖరారు చేస్తూ పత్రాలు ఇచ్చిన జనసేన అధిష్టానం ఇప్పుడు అధికారికంగా ప్రకటించింది.

క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

భీమవరం :క్షయవ్యాధి రహిత సమాజ నిర్మాణానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ బి.భానునాయక్, డిఎంహెచ్ఒ ఉమామహేశ్వరరావు సంయుక్తంగా జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా రోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలతో క్షయ వ్యాధికి అడ్డుకట్ట వేయవచ్చన్నారు. జిల్లా క్షయవ్యాధి నివారణాధికారి భానునాయక్ మాట్లాడుతూ జిల్లాలో 1690 కేసులు గుర్తించి క్రమం తప్పకుండా ఉచితంగా వైద్యసేవలు, మందులు అందిస్తున్నామన్నారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బంది, టిబి రోగులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. విస్తృత సేవలందించిన 20 మంది అధికారులకు, సిబ్బందికి ప్రశంశాపత్రాలు అందించారు. దాతల సహకారంతో పౌష్టికాహార కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.మాధవీకళ్యాణ్, వైద్యాధికారులు ఎన్.రంగారావు, జి.గోవిందబాబు, యాపిల్ ఆర్గనైజేషన్ కముజు శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక రాజ్యం కోసం సిఐటియు సమరశీల పోరాటాలు

రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు

ప్రజాశక్తి - తణుకు రూరల్

సంపదకు మూలమైన కార్మిక రాజ్యం కోసం సిఐటియు సమరశీల పోరాటాలు నిర్వహిస్తోందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక రాజకీయ శిక్షణ తరగతులు చివరిరోజున సిఐటియు నిర్మాణం - పని పద్ధతులపై ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మోడీ చెబుతున్న వికసిత్ భారత్‌లో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. కార్మికులు నేడు బానిసలుగా మార్చే ప్రయత్నం చేయడం కోసమే నాలుగు లేబర్ కోడ్లు మోడీ తీసుకొచ్చారని అన్నారు. కార్మికులు, ఉద్యోగుల శ్రమ ద్వారా సంపద పెరుగుతున్నప్పటికీ వారిపట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిన్న చూపు ఉందని విమర్శించారు. కేవలం మోడీ ప్రభుత్వం కార్పొరేట్లు ఇచ్చే ఎలక్టోరల్ బాండ్స్ కోసం ప్రభుత్వ సంస్థలు కారు చౌకగా అమ్మేయడం లేదా మూసివేయడం గానీ జరుగుతోందని అన్నారు. దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీయడం కోసం మతం పేరుతో విభజన రాజకీయాలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ బారి నుండి లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అభ్యుదయ వాదులపై ఉందన్నారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సంఘటిత, అసంఘటిత కార్మికులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పరిశ్రమల యాజమాన్యం వల్ల వస్తున్న సమస్యలు పట్టించుకునేవారే లేరని తెలిపారు. స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు ఇవ్వాలన్న చట్టాన్ని యాజమాన్యాలు అమలు చేయడం లేదన్నారు. సిఐటియు రానున్న కాలంలో కనీస వేతనాలు పెంచాలని, అన్ని పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలు చేయాలని లేకుంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులకు సహాయ, సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, ప్రిన్సిపల్ ఎస్.వెంకటేశ్వరరావు, కర్రి నాగేశ్వరావు, డి.కళ్యాణి, జె.శ్రీనివాస్, పి.దక్షిణామూర్తి, కె.ఝాన్సీ, ఎం.ఆంజనేయులు, అజయకుమారి, గుబ్బల గోపి, వల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్.ఆదినారాయణ బాబు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - పాలకోడేరు

రానున్న రోజుల్లో జరిగే ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసులు ప్రజలకు ఎల్లవేళలా తోడుంటారని భీమవరం డిఎస్‌పి వి.నారాయణస్వామి భరోసా కల్పించారు. పాలకోడేరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విస్సాకోడేరు, గొల్లలకోడేరు, గరగపర్రు గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో ఆదివారం కవాతు నిర్వహించారు. అనంతరం గరగపర్రు సచివాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశానికి పాలకోడేరు ఎస్ఐ నాలం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి నారాయణస్వామి రెడ్డి, భీమవరం రూరల్ సిఐ సత్యకిషోర్ మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ అనూహ్య, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ నేత అప్పారికి నివాళి

ప్రజాశక్తి - వీరవాసరం

యుటిఎఫ్‌ను ఎదురులేని సంఘంగా నిలబెట్టిన ఘనత అప్పారి వెంకటస్వామికి దక్కుతుందని యుటిఎఫ్ నాయకులు అన్నారు. అప్పారి వెంకటస్వామి వర్థంతి సభను ఆదివారం యుటిఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండలాధ్యక్షులు జివి.రమణ అధ్యక్షతన నిర్వహించిన వర్థంతి సభలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జివివి.రామానుజరావు మాట్లాడుతూ యుటిఎఫ్ అవిర్భావ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా అప్పారి సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ముద్రగళ శ్రీనివాసరావు, బి.కృష్ణారావు, కె.నాగమునేశ్వరావు, బి.అచ్చియ్య, ఎన్ఎస్ఎన్.రాజు, గోవిందరాజులు పాల్గొన్నారు.

బొలిశెట్టిని గెలిపించండి
సినీ నటుడు సుమన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మంచి మనసున్న వ్యక్తి, కష్టాల్లో ఉన్నవారికి తానున్నానంటూ సహాయపడే బొలిశెట్టి శ్రీనివాస్‌ను తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎగా గెలిపించాలని సినీ నటుడు సుమన్ పిలుపునిచ్చారు. ఆదివారం బొలిశెట్టి శ్రీనివాస్ నివాసానికి విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతానికి రాజకీయాలకు తాను దూరంగా ఉన్నానని, మంచి వ్యక్తులను ఎన్నుకోవడానికి ప్రజలు పార్టీలకు అతీతంగా పని చేయాలన్నారు. తనకు బొలిశెట్టి శ్రీనివాస్ పదేళ్ల నుంచి మిత్రుడని, అధికారంలో లేకపోయినా తన సొంత డబ్బుతో ప్రజాసేవ చేస్తున్న విషయాన్ని గమనించానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తాను ప్రత్యక్షంగా ఏ పార్టీకి ప్రచారం చేయనని, మంచి మనసున్న బొలిశెట్టి శ్రీనివాస్ వంటి వ్యక్తులను గెలిపించుకోవడం ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి ప్రతిఒక్కరూ తోడ్పడాలన్నారు. సుమన్ రాక తెలుసుకున్న అభిమానులు బొలిశెట్టి శ్రీనివాస్ ఇంటికి భారీగా చేరుకున్నారు.

మానసిక రోగాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

శారీరక వైద్యం, మానసిక వైద్యం వేర్వేరు అని, అంతుపట్టని సమస్యలతో ఒత్తిడి తెచ్చుకుని మానసికంగా కుంగిపోవడం మానసిక రోగమని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు జివి.రమణారావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో శాంతి నర్సింగ్ హోమ్‌లో మానసిక రోగాలు, వాటి నివారణపై ఆదివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణారావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువత డ్రగ్స్, మద్యపానానికి బానిసలై మానసిక స్థితిని కోల్పోతున్నారన్నారు. అటువంటి వారు మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలని చెప్పారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మానసిక ఆందోళనలు ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.చాన్‌బాషా, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'వైసిపి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత'

ప్రజాశక్తి - పోడూరు

జగన్ పాలనలో అన్ని తరగతుల ప్రజల జీవన పరిస్థితులు దుర్భరంగా మారాయని, వారు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, టిడిపి కూటమి కోసం ఎదురుచూస్తున్నారని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మన పాలకొల్లు మన రామానాయుడు ఇంటింటి పాదయాత్రలో భాగంగా మండలంలోని వేడంగిపాలెంలో ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పలువురు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు సమక్షంలో టిడిపిలోకి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

'డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్'

ప్రజాశక్తి - తణుకు

ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ ఆంధ్ర ప్రదేశ్‌గా మార్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శించారు. ఆదివారం ఆయన నివాసం వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నాన్ని రాజధానిగా చేస్తానంటూ కబుర్లు చెప్పిన జగన్ చివరకు దానిని డ్రగ్స్ రాజధానిగా చేశారని విమర్శించారు. ఉపాధి అవకాశాలకు యువతను ప్రోత్సహిస్తూ చంద్రబాబు పరిపాలన సాగిందన్నారు. జగన్ అధికారంలోకొచ్చాక యువతను విస్మరించారని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, నాయకులు బసవ రామకృష్ణ, కలగర వెంకటకృష్ణ, తోట సూర్యనారాయణ, గుబ్బల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాలకోడేరు

గుర్తు తెలీని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విస్సాకోడేరులో ఆదివారం చోటు చేసుకుంది. పాలకోడేరు ఎస్ఐ నాలం శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... రెండు రోజుల నుంచి విస్సాకోడేరు గ్రామంలో మతిస్థిమితం లేకుండా ఒక వ్యక్తి స్థానిక చెరువుగట్టుపై ఉన్న పచ్చగడ్డిని తింటూ సంచరిస్తున్నాడు. ఈ క్రమంలో చెరువు సమీపన గట్టుపై మృతి చెందాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు నీలం రంగు జీన్స్ ప్యాంట్, బెల్టు, తెలుపు రంగు బన్ని ధరించి ఉన్నాడని, కుడి చేయి కుడివేలుకు రాగి ఉంగరం ఉందని, కుడి చేతిపై శ్రీజ, అనూష పేర్లు గల పచ్చబొట్టు, త్రిశూలం గుర్తు ఉన్నాయని తెలిపారు. వివరాలు తెలిసినవారు తమకు సమాచారం అందించాలని కోరారు. విఆర్ఒ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితునికి రిమాండ్

ఆచంట :ఒక సామాజిక తరగతిని అవమానపరుస్తూ వాట్సాప్ గ్రూపులో పోస్టింగ్ పెట్టిన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు నరసాపురం డిఎస్‌పి డి.శ్రీనివాసరావు తెలిపారు. ఆచంట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆచంట మండలంలోని శేషమ్మ చెరువు గ్రామానికి చెందిన పిల్లి సంతోష్‌కుమార్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సామాజిక తరగతిని అవమానపరుస్తూ పోస్టింగ్ పెట్టారు. సదరు పోస్టింగ్‌ను స్క్రీన్ షాట్ తీసి వివిధ వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. ఒక వాట్సాప్ గ్రూపులో సభ్యుడైన మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు, మండలంలోని కోడేరు గ్రామానికి చెందిన సరేళ్ల శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నరసాపురం డిఎస్‌పి ఆదేశాల మేరకు పిల్లి సంతోష్‌కుమార్‌పై కేసు నమోదు చేసి అతడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. దర్యాప్తు అనంతరం సంతోష్ కుమార్‌ను ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎవరైనా ఇటువంటి కుల, మతాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టింగులు, కామెంట్లు పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇటువంటి పోస్టింగుల ద్వారా యువకులు అరెస్ట్ అయితే వారి భవిష్యత్ అంధకారంలోకి వెళ్తుందని, ఈ విషయంపై తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పెనుగొండ సిఐ చరణ్, ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

భర్తపై ఫిర్యాదు..

ఉండి : శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు మేరకు ఉండి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉండి గ్రామానికి చెందిన దువ్వి సూరిబాబు, దువ్వి జ్యోతి 2011లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో ఇటీవల చెడు వ్యసనాలకు బానిసైన సూరిబాబు వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని జ్యోతి ఉండి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు సూరిబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

అనారోగ్య బాధితునికి అండగా స్నేహితులు

ప్రజాశక్తి - మొగల్తూరు

అనారోగ్య బాధితునికి అతని స్నేహితులు అండగా నిలిచారు. మొగల్తూరు పంచాయతీ పరిధి ఆదర్శనగర్ కాలనీకి చెందిన మారెళ్ల గణపతికి ఇటీవల కాలంలో రెండు కిడ్నీలు పాడయ్యాయి. కిడ్నీ మార్పిడి చికిత్స చేయించుకునేందుకు సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడని తెలుసుకున్న మొగల్తూరు శ్రీపెనుమత్స రంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005లో పదో తరగతి చదివిన గణేష్ స్నేహితులు తమ వంతు సాయంగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.40500 సేకరించి ఆదివారం సాయంత్రం గణేష్‌కు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ స్నేహితుడి వైద్య ఖర్చులకు దాతలు సహకరించాలని కోరారు. సహాయం చేయాలనుకునే దాతలు 9550138545 సంప్రదించాలన్నారు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా సహాయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహచరులు రాము, సురేష్, గణేష్, పాము, శివకృష్ణ, త్రివిక్రమ్, కె.ప్రసాద్, ఎన్.శ్రీను, ఐ.రాజు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - నరసాపురం

రక్తదానం ప్రాణదానంతో సమానమని జనసేన పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ అన్నారు. మార్చి 27న గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ పుట్టినరోజును పురస్కరించుకుని మండలంలోని చిట్టవరంలో స్థానిక అంజనాపుత్ర చిరంజీవి పవన్‌కళ్యాణ్ యువసేన ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బొమ్మిడి నాయకర్ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తం అందక ఎవరూ చనిపోకూడదని మెగాస్టార్ చిరంజీవి పిలుపునందుకుని ఆయన అభిమానులు నిరంతరం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ఎందరికో ప్రాణదాతలు అయ్యారన్నారు. మెగా హీరోల పుట్టినరోజులను పురస్కరించుకుని అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న మెగా అభిమానులను ఆయన అభినందించారు. హోప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలకొల్లుకు చెందిన ఆపద్బంధు బ్లడ్ బ్యాంకు వారు 32 మంది అభిమానుల నుంచి రక్తాన్ని సేకరించారు. చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ వారు పంపిన సర్టిఫికెట్లను రక్తదాతలకు అందించారు. అనంతరం రామ్‌చరణ్ పుట్టినరోజు కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ కార్యక్రమంలో అభిమానులు కోపల్లి శ్రీనివాస్, చల్లా హేమ, శానం రామకృష్ణ, గ్రంధి శ్రీను, పోలిశెట్టి సత్తిబాబు, గుగ్గిలపు శివరామకృష్ణ, పైడికొండల కృష్ణ, కర్రా శ్రీను, పోలిశెట్టి బాబి, కొప్పిరెడ్డి హరిబాబు, మద్దుల శ్రీనివాస్, నిప్పులేటి రామారావు, గుబ్బల మర్రాజు, కూనపురెడ్డి రామకృష్ణ, దూసనపుడి కోటి పాల్గొన్నారు.

26న ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

బాలలకు సంబంధించిన గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 26వ తేదీన మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహించనున్నారు. వసుధ ఫౌండేషన్ వారి సహకారంతో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) 15 ఏళ్ల లోపు పిల్లలను పరీక్షించి, పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య చికిత్సలు అందిస్తారు. ఈ వైద్యశిబిరాన్ని భీమవరం పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు కోరారు. వివరాలకు 9949093115 సంప్రదించాలని తెలిపారు.

యువకుల చేతుల్లోనే రాష్ట్ర భవిష్యత్తు

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్ర భవిష్యత్తు యువకుల చేతుల్లోనే ఉందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఉండి నిమ్మలపేటలో పార్టీ గ్రామ అధ్యక్షుడు కరిమెరక మల్లికార్జున ఆధ్వర్యంలో టిడిపి, జనసేనకు చెందిన 50 మంది కార్యకర్తలు పివిఎల్.నరసింహరాజు సమక్షంలో ఆదివారం వైసిపిలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పివిఎల్ ప్రతిఒక్కరూ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీహరినారాయణరాజు, గులిపల్లి అచ్చారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తీర ప్రాంతం అభివృద్ధికి కృషి
చీఫ్ విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

తీర ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించిందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని పేరుపాలెం సౌత్‌లో శనివారం రాత్రి ఆయన బస చేశారు. ఆదివారం మార్నింగ్ వాకింగ్ కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అండగా వైసిపి ప్రభుత్వం ఉందన్నారు. తీర ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు వైసిపి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

పద్మశ్రీని కలిసిన శ్రీనివాస్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గ నాయకులతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సుంకర పద్మశ్రీ ఆదివారం భీమవరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల నేపథ్యంలో పార్టీ విధి విధానాలపై నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా నరసాపురం నియోజకవర్గ నాయకుడు మోకా చిన శ్రీనివాస్ ఆమెను కలిసి నరసాపురం నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు.

జనసేనలోకి చేరిక

ప్రజాశక్తి - మొగల్తూరు

రానున్న ఎన్నికల్లో నరసాపురంలో జనసేన పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ అన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ సిద్ధాంతాలకు ఆకర్షితులై పలువురు పార్టీలోకి స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. మండలంలోని కాళీపట్నం గ్రామానికి చెందిన సుమారు వంద మంది నాయకర్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొల్లాటి గోపీకృష్ణ, బందెల రవీంద్ర, గుబ్బల మార్రాజు, నిప్పులేటి తారకరామారావు, గంటా కృష్ణ, ఒడుగు ఏసు, కొప్పాడి శేఖర్, బెల్లంకొండ నాయుడు, మైల వసంతరావు, మైల శివకుమార్, కొప్పాడి శ్రీను పాల్గొన్నారు.

తలుపు బిగించండి మహాప్రభో..!
మరమ్మతులకు గురైన మరుగుదొడ్డి తలుపు
ప్రజల ఇబ్బందులు


మరమ్మతులకు గురైన తలుపు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని చిట్టవరం గ్రామంలో గ్రామ సచివాలయం వద్ద మరుగుదొడ్లు నిర్మించారు. సచివాలయానికి వచ్చే ప్రజలు ఇవి ఉపయోగించుకునే విధంగా వీటిని నిర్మించారు. ఇవి ప్రారంభించిన కొన్నిరోజులకే తలుపు ఊడిపోయి వేలాడుతుంది. మరుగుదొడ్లకు తలుపు లేకపోవడంతో పలు సేవల నిమిత్తం సచివాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఈ మరుగుదొడ్లు నిర్మించారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ నెల నాలుగో తేదీన చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సచివాలయం వద్ద నీటి సరఫరా పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ రోజు కూడా అధికారులు అప్రమత్తం కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కనీసం తలుపు బిగించలేకపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తలుపునకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా సీతా పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని విష్ణు విద్యాసంస్థల్లో బి.సీత పాలిటెక్నిక్ కళాశాల 27వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో విష్ణు విద్యాసంస్థల ఛైర్మన్ కెవి.విష్ణురాజు మాట్లాడుతూ రానున్న కాలంలో కంప్యూటర్ అవకాశాలతో పాటు సెమి కండెక్టర్, ఆటోమొబైల్, ఏరో స్పేస్ వంటి రంగాల్లో సాంకేతిక విద్య అభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు పుష్కలంగా అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. దానికి పునాది పాలిటెక్నిక్ విద్య ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన 2023 ఐఎఎస్ అలిండియా ఐదో ర్యాంకర్ చినమిల్లి శివన్నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఆర్థికంగా ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఉన్నా గాని లక్ష్య సాధనలో గమ్యం చేరుకోవడానికి విద్య ఒక్కటే మార్గమన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి ఉన్నత చదువుల కోసం చిన్న చిన్న పనులు కూడా చేసి తాను ఈ స్థాయికి చేరుకోవడానికి సీత పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకులు, యాజమాన్యం అందించిన సహకారం కారణమన్నారు. కళాశాల ప్రధానాచార్యుడు సిహెచ్. రామకృష్ణ కళాశాల లక్ష్యాలను వివరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విష్ణు సంస్థల డైరెక్టర్ (అడ్మిన్) ప్రసాద్ రాజు, ఎజిఎం రమేష్‌రాజు, ఇంజినీరింగ్ కళాశాలల ప్రధానాచార్యులు, ఉప ప్రధానాచార్యులు, వివిధ విభాగాధిపతులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

క్షయపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గణపవరం

క్షయ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పి.సంతోష్‌నాయుడు, పి.కిరణ్మయి అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఆదివారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు క్షయవ్యాధిపై తమ ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరికైనా 15 రోజుల పాటు జ్వరం, దగ్గు, బరువు తగ్గటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్యం పొందాలన్నారు. వ్యాధి నిర్ధారణకు పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఒకవేళ వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు మందులు వాడాలని చెప్పారు. 2030 నాటికి క్షయను అంతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్‌బాబు, టిబి సూపర్‌వైజర్ రవేష్ ల్యాబ్ టెక్నీషియన్, ఆరోగ్య కార్యకర్తలు జి.శ్రీనివాస్, ఎ.కృష్ణ, ఎం.మల్లయ్య, ఎం.యోహాన్, హెచ్‌విసి.పద్మజ, స్టాఫ్ నర్స్ డి.శిరోమణి, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నరసాపురం :మూడు వారాలకు మించి దగ్గు ఉంటే అది క్షయ వ్యాధి కావొచ్చని, అవగాహన కలిగి జాగ్రత్తలు వహించాలని నరసాపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.సుప్రియ అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా అవును మేము క్షయవ్యాధిని అంతం చేయగలం అనే నినాదంతో ఆదివారం నరసాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.సుప్రియ మాట్లాడుతూ టీబీ వ్యాధి ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుందని, క్షయ వ్యాధి దగ్గు, తుమ్మడం, ఉమ్మి వేయడం ద్వారా గాలిలో కలుస్తుందన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే రోగికి ఆరు నెలల మందులు ఉచితంగా అందిస్తామన్నారు. క్షయ వ్యాధి మందులను క్రమం తప్పకుండా ఆరు నెలలు వాడితే పూర్తిగా నయమవుతుందని తెలిపారు. గర్భిణులు టిబి, కఫం పరీక్ష చేయించుకోవాలన్నారు. అనంతరం క్షయ వ్యాధి రోగులకు పౌష్టికాహారం కిట్లు అందించారు. క్షయ వ్యాధి నివారణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ నళిని, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ గణేష్, ఐసిటిసి మెడికల్ కౌన్సిలర్ జేసు ప్రసాద్ బాబు, టిబి హెచ్‌వి మురళి, బిందు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

ఆకివీడు :గ్రామీణ ప్రజలకు పలు అంశాలపై అవగాహన కలిగే విధంగా విద్యార్థులు చేసిన ప్రయత్నం మంచి ఫలితాన్ని ఇస్తుందని దుంపగడప వివి.గిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శారద అన్నారు. కళాశాల విద్యార్థులకు వారం రోజులుగా గ్రామంలోని బోసురాజు కాలనీలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ అంశాలపై గ్రామస్తులకు పలు విషయాలను వివరించారు. గ్రామాలను శుభ్రం చేయడం, గ్రామంలో నాయకుల విగ్రహాలను శుభ్రం చేసి వాటి విలువను తెలియజేయడం, పాఠశాలలోని విద్యార్థులకు పలు అంశాలపై విషయ అవగాహన చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం శిబిరం ముగింపు సభ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సభకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శారద అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ కె.ఆనంద్‌కుమార్ వారం రోజుల నుండి నిర్వహించిన కార్యక్రమాలను సభకు వివరించారు. సభలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ తంగి యోగేశ్వరరావు, లెక్చరర్ డాక్టర్ కె.ఆనంద్‌కుమార్, డాక్టర్ సిహెచ్‌వి.అనిల్, గ్రామస్తులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం
గరికిపాటి నరసింహారావు

ప్రజాశక్తి - పాలకొల్లు

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని మహా శతావధాని గరికిపాటి నరసింహారావు అన్నారు. నీటి పొదుపు, సౌర విద్యుత్ వాడకాలను సామాజిక బాధ్యతగా తీసికొని ప్రచారం చేయాలని ఆయన కోరారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో లయన్స్ క్లబ్‌ల ప్రాంతీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కొన్ని దేశాల్లో బిందు సేద్యాన్ని ప్రోత్సహిస్తూ నీటిని పొదుపు చేస్తున్నాయని, మన దేశంలో విచ్చలవిడిగా వాడటం వల్ల కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, కొన్ని చోట్ల అనావృష్టి ఉంటుందని చెప్పారు. ప్రతి ఇంట్లో ముఖ్యంగా అపార్ట్‌మెంట్‌లో సౌర విద్యుత్ ఫలకాలు వాడేలా లయన్స్ క్లబ్ ప్రచారం చేయాలన్నారు. లయన్స్ క్లబ్ రీజియన్ ఛైర్‌పర్సన్ కాశీనాధుని భద్ర ఫణేంద్రుడు, జ్యోతి దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం రూ.10 లక్షల విలువైన 50 గ్రైండర్లు, సైకిళ్లు, ఇస్త్రీ పెట్టెలు బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, మొదటి, రెండో గవర్నర్లు కాకర్ల వేణుబాబు, ఎన్‌విఎస్.పాపారావునాయుడు, పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, నందుల సీతారామారావు, కారుమూరి నరసింహారావు, రేపాక ప్రవీణ్, వరప్రసాద్, అరుణ, కర్నేన రోజారమణి, ముచ్చర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

'యువత భవితను చిదిమేస్తున్న జగన్'

ప్రజాశక్తి - నరసాపురం

యువత భవితను జగన్ డ్రగ్ మాఫియా చిదిమేస్తుందని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. నరసాపురంలోని ఆమె నివాసంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. టిడిపి హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో మొదటి స్థానంలో ఉన్న ఎపిని జగన్ గంజాయి, డ్రగ్ రవాణాలో మొదటి స్థానానికి చేర్చారన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఎపిలోనే దొరుకుతున్నాయన్నారు. జగన్ దోపిడీని యువత ప్రశ్నించకుండా, నిలదీయకుండా ఉండటం కోసం మత్తులో దించి గేమింగ్, క్యాసినోతో జాతిని నిర్వీర్యం చేస్తూ తల్లిదండ్రులకు కడుపు కోత మిగులుస్తున్నాడన్నారు. డ్రగ్స్ కుంభకోణం వెనుక తాడేపల్లి ప్యాలెస్ హస్తం ఉందని, అందుకే వైసిపి నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సోషల్ మీడియా కోఆర్డినేటర్ చల్లా పద్మావతి, బండి స్వర్ణలత, సుంకర రాజకుమారి, కంభాల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో జగన్‌ను, పాలకొల్లులో తనను గెలిపించాలని వైసిపి పాలకొల్లు అభ్యర్థి గుడాల గోపి కోరారు. పట్టణంలోని నాలుగో వార్డులో ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. గోపీ సతీమణి గుడాల మంగతాయారు, వారి కుమారుడు గుడాల సాయి బాలాజీ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, చందక సత్తిబాబు, ఎఎంసి మాజీ ఛైర్మన్ సాల నరసయ్య, నాలుగో వార్డు ఇన్‌ఛార్జి తలువురి భుజంగరావు పాల్గొన్నారు.

నియోజవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా
భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి అంజిబాబు

భీమవరం రూరల్ : భీమవరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను పని చేస్తానని జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. 31, 32 వార్డులోని వైసిపి నాయకులు అంజిబాబు, కోటికలపూడి గోవిందరావు సమక్షంలో జనసేన పార్టీలోకి చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ అల్లర్లు, కేసులు, విమర్శలతోనే వైసిపి ఎంఎల్ఎ పాలన సాగిందన్నారు. ఇక అటువంటి పాలనకు స్వస్తి చెబుదామన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు చినబాబు మాట్లాడుతూ జగన్ రాక్షస పాలన పోవాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. తొలుత భీమవరం శ్రీ మావుళ్లమ్మను అంజిబాబు దర్శించుకున్నారు. పట్టణంలోని 15వ వార్డు టిడిపి, జనసేన శ్రేణులు అంజిబాబును కలిశారు.

ప్రజలకు సేవ చేసేందుకే వైసిపి
ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజలకు సేవ చేయడం కోసమే వైసిపి ఆవిర్భవించిందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో ఆదివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు భవిష్యత్తులో కూడా కొనసాగాలంటే మరోసారి జగన్ సిఎం కావాలన్నారు.

కోళ్లపర్రులో ఎంఎల్ఎ రామరాజు పర్యటన

ప్రజాశక్తి - ఆకివీడు

టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి మంతెన రామరాజు నియోజకవర్గంలో పర్యటన జోరుగా సాగిస్తున్నారు. అందులో భాగంగా ముందుగా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రత్యేక కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఆదివారం మండలంలోని కోళ్లపర్రు గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామస్తులు పున:ప్రతిష్టలు జరిపారు. ప్రతిష్టల అనంతరం ఎంఎల్ఎ రామరాజును గ్రామస్తులు సన్మానించారు. అనంతరం ఆయన గ్రామంలో పర్యటించి పార్టీ ఎన్నికల ప్రణాళికను వివరించారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం యాత్రికులతో ఆదివారం కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. పాలకవర్గ సభ్యులు ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా మట్టల ఆదివారం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు నక్కావారిపాలెం గ్రామంలోని ఆర్‌సిఎం చర్చిలో ఆదివారం మట్టల ఆదివారం వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘస్తులు గ్రామంలో మట్టలతో ప్రదర్శన చేశారు. అనంతరం దేవాలయంలో సంఘ కాపరి పైడి భూషణం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, క్రైస్తవ విశ్వాసులు ప్రార్థనలు చేశారు.

ఉండి :మట్టల ఆదివారం వాడ వాడలా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉండి గ్రామంలోని పెదపేట సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టలు చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు.

ఆచంట : కొడమంచిలి పరిశుద్ధ పేతురు లూథరన్ దేవాలయం పారిస్ పాస్టర్ జేమ్స్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సండే స్కూల్ చిన్నారులు ర్యాలీ నిర్వహించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - ఆచంట

సహజ యోగా చేయడం ద్వారా రోగాలు దరికి చేరవని విశ్రాంతి ఉపాధ్యాయురాలు, సీనియర్ యోగా సభ్యురాలు నెక్కంటి హేమలత అన్నారు. ప్రముఖ పిరమిడ్ ధ్యాన గురువు సుభాష్‌పత్రీజీ ఆధ్వర్యంలో ఆచంట పిరమిడ్ ధ్యాన కేంద్రం పుష్కర వార్షికోత్సవ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, చురుకుదనం కలుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ రోజుకు 15 నుంచి 30 నిమిషాల పాటు యోగా చేస్తే మంచి ఫలితాలు పొందుతారని ఆమె తెలిపారు. వ్యసనాలకు దూరంగా ఉండేందుకు విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు యోగా ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా సభ్యులు నంబూరి వెంకటరమణ, వల్లూరి ఝాన్సీరాణి, కొడమంచిలి ఉషారాణి, లక్ష్మి పాల్గొన్నారు.

అఖండ అన్న సమారాధన

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని చెరుకువాడ గ్రామ దేవత అలుగులమ్మ ఆలయం 105వ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా ఆదివారం అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు, ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు పాల్గొన్నారు. వీరిని గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పివిఎల్.నరసింహరాజు, శివరామరాజు మాట్లాడుతూ గ్రామస్తుల ఆర్థిక సహకారంతో వార్షికోత్సవం, అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ అన్నసమారాధనలో చెరుకువాడ, పరిసర ప్రాంతాల నుంచి సుమారు ఐదు వేల మంది భక్తులు ప్రసాదం స్వీకరించారని తెలిపారు.

'శెట్టిబలిజ అభ్యర్థులను గెలిపించాలి'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రాష్ట్రంలో శెట్టిబలిజ సామాజిక తరగతికి చెందిన అభ్యర్థులు ఏ పార్టీలో ఉన్నా గెలిపించాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పాలిక శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని సగం చెరువులో శెట్టిబలిజ యువసేన సారధ్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన శెట్టిబలిజ యువసేన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కీర్తిశేషులు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు కుక్కల శ్రీనివాస్, రాష్ట్ర సంఘం అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్, వివిధ పార్టీల శెట్టి బలిజ సంఘం నేతలు పాల్గొన్నారు.